# ఆంధ్రప్రదేశ్ కు క్రైస్తవ్యం ఎలావచ్చింది?

-- హెప్సీబా సుంకరి

## భారత దేశంలో క్రైస్తవ్య ప్రవేశం:

క్రైస్తవ్యాన్ని భారత దేశంలో మొట్టమొదట ప్రవేశపెట్టినవాడు క్రీస్తు శిష్యుడైన తోమా. ఇతడు క్రీ. శ. 53లో పర్షియా దేశం నుండి దక్షిణ భారతదేశంలో మలబారులోని పెరియారు నదీ తీరపు ముఖద్వారంలో ఉన్న క్రాంగనూరు చేరి, అక్కడ క్రీస్తుని గురించి బోధించాడు అని ఆధునిక చరిత్రకారులు భావిస్తున్నారు .

క్రీస్తు పూర్వం నుండే తూర్పు మధ్యధరా ప్రాంతాలకు, భారతదేశానికి నౌకాయానం ద్వారా వర్తక, వాణిజ్య సంబంధాలుండేవి. ఈ నౌకాయానం ముఖ్యంగా మూడు మార్గాల ద్వారా జరుగుతుండేవి. సింధూనదీ ప్రాంతం నుండి ఖైబర్, బోలాన్ కనుమల ద్వారా కాస్పియన్ సముద్ర సమీపాన ఉన్న పట్టణాలకు చేరడం, భారతదేశం పశ్చిమ తీరంలోని పెరియారు నదీప్రాంతం నుండి ఎర్రసముద్రం చేరి, ఆ మీదుగా నైలునదికీ, అలెగ్జాండ్రియాకు వెళ్ళడం. కాబట్టి భారతదేశానికి నౌకామార్గం, వాణిజ్య సంబంధాలు వున్నందువల్ల క్రైస్తవ్యం భారతదేశానికి మొదటి శతాబ్దంలో వచ్చిందనడంలో ఎట్టి సందేహం లేదు.

మొట్టమొదట తోమా సువార్త బోధన ద్వారా క్రాంగనూరులో నాలుగు హిందూ కుటుంబాల వారు క్రైస్తవులుగా మారారు. అతడు వారికి బైబిలును బోధించి, ప్రార్థనాధికాలను నేర్పించి, తర్వాత క్రాంగనూరుకు దక్షిణంగా నున్న మలియన్ కార, పాలయూర్, గోకమంగళం, నీరాణం, చాయల్, క్విలాన్ అనే ప్రాంతాలలో క్రీస్తు సువార్తను బోధించి, సంఘాల్ని స్థాపించాడు. తోమా మలబారు ప్రాంతం నుండి చెన్నపట్టణం చేరి సువార్త ప్రచారం చేశాడు. ఆ రక్షణ సువార్త విని అనేకులు క్రైస్తవులుగా మారడం చూచి, అక్కడి పురోహిత వర్గం క్రీ.శ. 72లో తోమాపై దాడి చేసి, ఈటెలతో పొడిచి చంపారు. ఆ చంపిన ప్రదేశమే నేడు శాంతోం లేదా సెయింట్ థామస్ మౌంట్ గా వ్యవహరించబడుతుంది.

క్రీ.శ. 345లో ఎడెస్సా ప్రాంతం వాడైన బిషప్ థామస్ మలబారు రావడంతో క్రైస్తవ్యం క్రమంగా విస్తరింపనారంభించింది. సిరియా నుండి వచ్చిన కనాయి తోమా అనే వ్యాపారస్తుడు భారతదేశం వచ్చి సుగంధద్రవ్యాల్నికొని, సిరియాకు ఎగుమతి చేసేవాడు. అతనిద్వారా సిరియానుండి వచ్చిన బిషప్ థామస్ క్రాంగనూరులో స్థిరపడ్డట్టు, అప్పటి క్రాంగనూర్ రాజు పెరుమాళ్ ఇతనికి ఆశ్రయమిచ్చినట్లు తెలుస్తుంది. మలబారు ప్రాంతాల్లో అంటరానివారుగా

పరిగణింపబడే జాలరులను పరవర్లు అని పిలిచేవారు. సిరియా నుండి వచ్చిన క్రైస్తవ బోధకులు పరవర్లకు క్రీస్తును గూర్చి బోధించడమేకాక, అభివృద్ధికి తోడ్పడ్డారు. ఆ తరువాత పోర్చుగీసు వారి రాకతో భారతదేశంలో క్రైస్తవ్యం అంచెలంచెలుగా విస్తరించింది. పోర్చుగీసువాడైన వాస్కోడిగామా దక్షిణాఫ్రికాలోని గుడ్ హోప్ అగ్రాన్ని చుట్టి 1498లో మే 20న దక్షిణ భారతదేశంలో పశ్చిమతీరంలో కళ్ళికోట చేరాడు. దీనితో క్రైస్తవ్య ప్రచారానికి, వాణిజ్యానికి క్రొత్తబాట వేసినట్లయింది. పోర్చుగీసువారు రోమన్ క్యాథలిక్కులవ్వడం వల్ల వారు పోపు అనుమతితో ప్రచారార్థం వచ్చేవారు. వ్యాపారం నిమిత్తం వచ్చే పోర్చుగీసు వారితో కలసి ఫాదరీలు కూడా వస్తుండేవారు. వారు ప్రార్థనాధికాలు నిర్వహించేవారు. తర్వాత పోర్చుగీసువారు బొంబాయి, కొచ్చిన్, తూత్తుకూడి, మైలాపూరు, నాగపట్నం మొదలగు ప్రదేశాల్లో వర్తక స్థావరాల్ని ఏర్పరుచుకున్నారు. 1493లో ఆరవ అలెగ్జాండరు సువార్త ప్రచారానికి అనుమతినివ్వడం వల్ల పోర్చుగీసువారు క్రీ.శ. 1500లో కొంతమంది బోధకుల్ని తమతోపాటు భారతదేశం తీసుకువచ్చారు. వారిలో మొదటివాడు లూయిస్ డోసాల్వడార్. ఇతడు క్రీ.శ. 1512లో విజయనగరం వెళ్ళి క్రీస్తును బోధిస్తూ స్థానిక ప్రజలచే చంపబడ్డాడు.

ఆ తరువాత ఫ్రాన్సిస్ గ్జేవియర్ (Francis Xavier) రాకతో క్రైస్తవ ప్రచారం బాగా సాగింది. పాశ్చాత్య దేశాలతో వర్తక వాణిజ్యాలు భారతదేశంతో కొనసాగుతున్నందువల్ల బైబిలు బోధన, ప్రార్థనాధికాలు నిర్వహించడానికి ఫాదరీల ఆవశ్యకత ఏర్పడింది. అంతకుపూర్వం ఉన్న క్రైస్తవులు దేశీయ భాషల్లో ప్రార్థనాధికాలు నిర్వహించేవారు. కాబట్టి పోర్చుగీసువారికి వారిభాషల్లో బోధించే వ్యక్తులు కావలసిన అవసరమేర్పడింది. ఈవిషయాన్ని పోర్చుగల్ దేశపు రాజైన మూడవ జాన్ (John-III) మూడవ పోప్ పాల్ తో ప్రస్తావించాడు. దీనికి పోప్ అంగీకారం తెలియజేయడంతో 1540 సెప్టెంబరు 27న సొసైటీ ఆఫ్ జీసస్ అనే సంస్థ ఆవిర్భవించింది. ఈ సంస్థనుండి భారత దేశానికి మొదట వచ్చినవాడే ఫ్రాన్సిస్ గ్జేవియర్.

ఇతడు 1542 మే 6న భారతదేశం పచ్చిమతీరాన గల గోవాచేరి సువార్త ప్రచారమారంభించాడు. ఐదు నెలల్లోనే తమిళభాష నేర్చుకొని, ఆ కాలంలో అంటరాని వారుగా పరిగణింపబడుతున్న పరవర్లు అనే మత్స్యకారులకు క్రీస్తును గూర్చి బోధించాడు. క్రీ.శ్. 1544 ప్రాంతంలో ఇతని బోధనల వల్ల ఆరువాన్కూరు రాజ్యంలోని మక్నాలో క్రీస్తునంగీకరించిన దాదాపు పదివేలమందికి బాప్తీస్మం

ఇచ్చాడు. క్రైస్తవ్యం స్వీకరించిన అనేక మంది కొరకు ప్రార్థనాలయాలు కట్టించాడు. అంతేకాక దేశీయ క్రైస్తవుల కొరకై సెయింట్ పాల్స్ కాలేజీని కూడా స్థాపించాడు.

రాబర్ట్ డి నోబిలి (Robert De Nobili) రాకతో క్రైస్తవ ప్రచారంలో నూతన శకారంభమైంది. ఇతడు జెసూట్ ఫాదరీల సంఘ ప్రతినిధిగా క్రీ.శ. 1606లో భారత దేశంలోని దక్షిణ తీరమైన మధురకు చేరుకుని, అక్కడే తమిళం నేర్చుకుని, సువార్త ప్రచారం చేశాడు. అప్పటి ఆ ప్రాంతాల నాయక రాజులు కూడా ప్రచారాన్ని ప్రోత్సహించారు. నోబిలి మధురకు రాకపూర్వమే మధురనేలిన వీరప్పనాయకుని కాలంలో (1572-1595) ఫాదర్ ఫెర్నాండెజ్ మధురలో క్రైస్తవ ప్రచారం చేశాడు. నోబిలి తన వేషభాషల్ని, ఆచార వ్యవహారాల్ని పూర్తిగా మార్చుకొని, శాఖాహారం మాత్రమే తీసుకుంటూ సువార్త ప్రచారం చేశాడు. ఇతని నిరాడంబర జీవితం, వేషభాషలు ప్రజలను ఆకర్షించాయి. నోబిలి పద్ధతులు ఇతర జెసూట్ ఫాదరీలకు భిన్నంగా ఉన్నందువల్ల ప్రజలు ఇతన్ని జగద్గురు 'తత్వబోధకస్వామి' అని పిలిచేవారు. ఇతని బోధలవల్ల దాదాపు 600 మంది హైందవులు క్రీస్తునందు విశ్వాసముంచి క్రైస్తవులుగా మారారు.

నోబిలి తరువాత జెసూట్ ఫాదరీలలో విశేషమైన కృషి చేసినవాడు ఫాదర్ బాషి (Fr. Baschi). ఇతడు కూడా నోబిలి వలె సన్యాసిలా 'వీరమాముని' అనే పేరుతో మధురలో 1711 నుండి 1742 వరకు క్రైస్తవ్య ప్రచారం చేశాడు. ఇతని కాలంలో ప్రొటెస్టెంట్ మిషనరీలు వచ్చి యేసుక్రీస్తు రక్షణ సువార్తను ప్రచారం చేశారు.

క్రీ.శ. 1291లో చైనాకు మత ప్రచారానికి వెళుతూ, దక్షిణభారతదేశంలో కొంత కాలముండిన జాన్ ఆఫ్ మాంటికార్వోనే అనునతడు మైలాపూరుకు పైగా నూరు మైళ్ళవరకు తిరిగి ప్రచారం చేసినట్లు చెప్పుకున్నాడు. కానీ అతని కృషివలన, తెలుగు సీమకు క్రైస్తవ వ్యాప్తి జరిగిన నిదర్శనాలేవీ కనబడటం లేదు. క్రీ.శ. 1670లో మచిలీపట్నంలో పోర్చుగీసు స్థావరమందు ఒక చర్చి ఉండేదని, అక్కడివారు కొందరు ప్రార్థనలు చేయడం చూసినట్లు కొందరు విదేశీ వర్తకులు రాశారు. కాని దానికి నిదర్శనాలేవీ ఈనాడు లేవు.

పోర్చుగీసువారి ప్రచార యత్నం సఫలమవడం చూసి అప్పటి ఫ్రెంచ్ పాలకుడైన పదునాల్గవ లూయీ, క్రైస్తవ్య ప్రచారానికై ఆరుగురు మత గురువులను (ఫాదరీలు) క్రీ.శ. 1700 సం||లో పుదుచ్చేరికి పంపారు. వీరు ప్రచారం నిమిత్తం ఆ సంవత్సరమే 'కర్ణాటక మిషన్' ను స్థాపించారు. ఇది తెలుగుదేశంలో క్రైస్తవ మతాన్ని వ్యాపింపజేయటానికి స్థాపింపబడ్డ మొదటి మిషను. ఈ మిషను వారు

రాబర్టు డి నోబిలీ మార్గాన్ని అవలంబించి, హిందూ సన్యాసుల వేషాలతో మత ప్రచారం చేస్తూ బ్రాహ్మణ, వైశ్య గృహాల్లోను, దేవాలయాల్లోను బస చేసేవారు. మొట్టమొదటి సారిగా ఈ మిషనుకు చెందిన ఫా. మాండ్విట్ ద్వారా క్రీ.శ. 1710లో చిత్తూరు జిల్లా పుంగనూరు క్రైస్తవకేంద్రమై అక్కడినుండి వెంకటగిరి, ఆయా పరిసరాలకు విస్తరించింది. వెంకటగిరి రాజా బంధువులలో కొందరు క్రైస్తవులుగా మారారు. తర్వాత వెంకటిగిరినుండి కోలారు జిల్లాలోని చిక్కబళ్ళాపురానికి క్రైస్తవ్యం వ్యాపించి, క్రీ.శ. 1709లో అక్కడ ఒక చర్చికూడా నిర్మింపబడింది. దానికి సమీపాన ఉన్న దేవనహళ్ళి, కృష్ణాపురంలో కూడా చర్చిలు కట్టబడ్డాయి. ఆనాడు ఎక్కువగా అన్ని రకాల ప్రజలు క్రైస్తవ్యాన్ని స్వీకరించారు. అక్కడి నుండి కడప జిల్లాలోని సిద్ధవటానికి, చిత్తూరు జిల్లాలోని వాయిల్పాడుకు క్రైస్తవ మతం వ్యాపించింది.

అనంతపురం జిల్లాలోని ముదిగుబ్బ, ఆలమూరులో కూడా 1720 నాటికి క్రైస్తవ్యం బాగా వ్యాపించింది. అక్కడ క్రైస్తవ్యం స్వీకరించిన వారిలో ముదటివాడు ముదిగుబ్బ నివాసి అయిన తుమ్మారాయపరెడ్డి. ఇతడు వైద్యానికి లొంగని ఒక ప్రమాదకరమైన జబ్బుతో బాధపడుతూ కృష్ణాపురం వెళ్ళి, అప్పుడక్కడ మతబోధకుడుగా ఉన్న ఫాదరీ లీగాక్ ప్రార్ధనలచే స్వస్థతనొంది క్రీ.శ. 1715లో క్రైస్తవ మతాన్ని స్వీకరించాడు. ఈతని సాక్ష్యం వలన ముదిగుబ్బ, ఆలమూరు గ్రామాల్లోని రెడ్లందరూ క్రైస్తవులయ్యారు. అక్కడ వారంతా ధనికులు కావడం వలన ఆ గ్రామాల్లో చర్చిలు నిర్మించి క్రైస్తవ మత పండగలు ఆడంబరముగా నిర్వహించేవారు. క్రీ.శ. 1725లో మహారాష్ట్ర సర్దారు ఈగ్రామాన్ని దోచుకోడానికి రాగా ప్రజలు గ్రామాన్ని వదలి ప్రకాశం జిల్లాలోని దర్శి సమీపంలోని బుక్కాపురానికి వలసపోయారు. తత్కారణంగా బుక్కాపురంలో కూడా క్రైస్తవ్యం ఏర్పడింది. 1773 నాటికి కర్ణాటిక్ మిషన్ కు 16 కేంద్రాలుండేయని చరిత్రకారులు రాశారు. క్రైస్తవ మిషనరీలు కులవిభేదాల ప్రస్తావనే తేలేదు.

క్రీ. శ.1750 నుండి క్రీ.శ.1776 వరకు ఆంధ్రదేశంలో క్రైస్తవ వ్యాప్తిని గూర్చిన విశేషాలంతగా తెలియవు. ఆనాడు పశ్చిమాంధ్రలో అరాచక పరిస్థితులేర్పడి క్రమంగా మిషనరీల సంఖ్య తగ్గుతూ వచ్చింది. క్రీ.శ.1743 లో కడప జిల్లాలోని కంబాలదిన్నెయందలి చర్చిని నిజాం సైన్యం పడగొట్టింది. ముదిగుబ్బ, క్రిష్ణాపురం,వెంకటగిరి ప్రాంతాలలోని చర్చిలు కూడా పడగొట్టబడ్డాయి. నెల్లూరు జిల్లాలోని కొన్ని క్రైస్తవ కుటుంబాలు గుంటూరు జిల్లాకు వలసపోయాయి. ఈ విధంగా క్రీ.శ.1770 నాటికి గుంటూరు జిల్లాలో తప్ప తక్కిన చోట్ల క్రైస్తవ్యం

క్షీణించింది. గుంటూరు జిల్లాలో ఫ్రెంచి వారికి పలుకుబడి వుండడంచేత కర్నాటిక్ మిషన్ వారు 77 1/2 ఎకరాల భూమిని ఈనాముగా పొందారు. 1773 లో నాటి పోప్ అయిన 14 వ క్లెమెంట్ జసూట్ సంఘాన్ని రద్దు చేసి, మిషనరీలందర్ని పుదుచ్చేరి మతప్రచార మండలాధికారి క్రింద పనిచేయవలసిందిగా ఆజ్ఞాపించాడు. ఈ విధంగా ఆధిపత్యం మారినప్పటికి గుంటూరుజిల్లాలో మాత్రం ప్రచారం ఎప్పటివలె సాగుతుండేది. క్రీ.శ.1782 నుండి 1788 వరకు గుంటూరు జిల్లా జమీందార్లకు గుత్తకీయబడింది. ఆ జమీందార్లు కూడ ఫాదరీలపట్ల సహనంతో మెలిగారు. రేపల్లె జమీందార్లు ఫిరంగిపురం ప్రాంతాన్ని 1784 లో ఫాదరీలకు కౌలుకిచ్చారు.

రేపల్లె దగ్గరున్న ఓలేటి గ్రామ కాపురస్తులు అక్కడి జమీందార్లు పెట్టే బాధల్ని భరించలేక 1787 లో చెంగల్పట్టు జిల్లాకు వలసపోయారని బిషప్ కాల్గన్ రాశాడు. ఈ ఓలేటి ప్రజలు ఫాదర్ మానెంట్ నాయకత్వం క్రింద చెంగల్పట్టు జిల్లాకు వెళ్ళి నాటి మద్రాసు గవర్నరు కాంప్ బెల్ ఆదరణవల్ల కొంత ప్రదేశం సంపాదించి, క్రీ.శ.1787 లో కాంప్ బెల్ పేరున ఒక గ్రామాన్ని నిర్మించుకున్నారు. దాన్నే కీళైచేరి అంటారు. ఈ నాడు ఓలేటిలో క్రైస్తవులు ఎక్కువగా లేకున్నప్పటికీ, ఫ్రెంచ్ భాషలోను, తెలుగు భాషలోను శాసనాలుగల ఒక క్రైస్తవ సమాధి మాత్రం ఆ ప్రాంతంలో వుంది.

క్రీ.శ.1788 లో గుంటూరు జిల్లా ఆంగ్లేయుల స్వాధీనంలోకి వచ్చింది. యూరప్ నందలి నాటి పరిస్థితుల వల్ల, ఫ్రెంచి విప్లవం వల్ల మిషనరీలకు తగిన ప్రోత్సాహం లభించక పోవడం వల్లక్యాథలిక్ వారి ప్రచారం తరువాత తీవ్రంగా సాగలేదు. పశ్చిమాంధ్రలో నామమాత్రంగా మిగిలిపోయిన క్యాథలిక్ క్రైస్తవ్యాన్ని పునరుద్ధరించడానికై గోవా మిషనరీ డిసౌజా క్రీ.శ.18 వ శ|| లో ప్రయత్నించాడు. ఇతడు 'ఆదికణాదస్వామి ' అని పేరు పెట్టుకొని కడప,అనంతపురం,బళ్ళారి జిల్లాల్లోని చాలప్రాంతాల్లో సువార్తను వ్యాపింపచేశాడు. క్రీ.శ.1800 లో ఈ ప్రాంతాలన్నీ ఇంగ్లీషువారి వశమైనందున ఇతని ప్రచారం చాలవరకు ఆగిపోయింది. చివరకీ మిషనరీ బెంగుళూరులో మరణించాడు. అప్పటి వరకు క్యాథలిక్కులు కృష్ణకు దక్షిణంగా క్రైస్తవ్య ప్రచారం చేస్తున్నప్పటికి తెలంగాణాలో మాత్రం ప్రచారం ఆలస్యంగా మొదలుపెట్టారు. 1834 లో హైదరాబాదులోను, 1845 లో విశాఖపట్టణంలోను తమ మిషన్ లను స్థాపించి నాటినుండి ప్రచారం చేస్తూనే వచ్చారు.

ఈ మిషన్‌లే కాక సొసైటీ ఫర్ ది ప్రాపగేషన్ ఆఫ్ గాస్పెల్, కెనడియన్ మిషన్ మొ|| వారు ఆయా ప్రాంతాల్ని కేంద్రాలుగా చేసుకుని సేవ చేసారు. అమెరికన్ బాప్టిస్టు కేంద్రం వారు నెల్లూరు కేంద్రంగాను, చర్చి మిషనరీ వారు విశాఖపట్నం కేంద్రంగాను, లూథరన్ వారు గుంటూరు కేంద్రంగాను, ఎస్.పి.జి. సంస్థవారు కడప, కర్నూలు, నంద్యాల లోను, వెస్లీ మిషంవారు హైదరాబాదు కేంద్రంగాను, ఎపిస్కోపల్ మెథడిస్ట్ సంఘంవారు బళ్ళారి ప్రాంతంలోను, ప్రొటెస్టెంట్ శాఖల పక్షంగా సువార్త ప్రచారం సాంఘిక సేవాధికార్యక్రమాలు కొనసాగించారు.

ఈ మిషన్లు అన్నీ క్రైస్తవ మతాన్ని స్వీకరించినవారికి పాఠశాలల్ని స్థాపించి, ఉచితంగా చదువు చెప్పించారు. వ్యాధి పీడితులకు ఉచితంగా మందులిప్పించారు. చదివి పరీక్షలలో ఉత్తీర్ణులైన వారికి, తమ మిషన్లద్వారా మతప్రచారకులుగా నియమించడం, తమ పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వోద్యోగాలిప్పించడం ద్వారా ప్రజల అభివృద్ధికెంతో తోడ్పడ్డారు. తరతరాలుగా సమాజంలో అణచివేయబడ్డ బీదప్రజల అభివృద్ధికి అన్నిరకాలుగా వీరు తోడ్పడ్డారు.

క్రైస్తవ మిషనరీలు మొదటినుండి ప్రాంతీయభాషల్ని ఆదరించారు. క్రైస్తవ మత సందేశాల్ని తెలిపే గ్రంథాలను రచించడానికి దేశీయుల్ని ప్రోత్సహించారు. ఇలాంటి గ్రంథాల్లో చెప్పదగింది పింగళి ఎల్లనార్యుడు రచించిన "తోభ్యచరిత్ర" అనే నామాంతరంగల "సర్వేశ్వర మహాత్మ్యం". ఇది తుమ్మారెడ్డికి అంకితం చేయబడింది. అలాంటిదే మరోగ్రంథం మంగళగిరి ఆనందకవి రచించిన "వేదాంత రసాయనము". ఇతడు దీనిని క్రీ.శ. 1750లో రచించి దానప్ప అనే క్రైస్తవ్యం స్వీకరించిన బ్రాహ్మణునికి అంకితమిచ్చాడు. మొట్టమొదటి మత ప్రచారం నిమిత్తం బైబిల్ని తెనిగించి, తెలుగు వారిలో వాఙ్మయాన్ని వెదజల్లడానికి ముద్రణాయంత్రాలను స్థాపించిన వారును క్రైస్తవులే. వీరి ప్రయత్నాలు తరచుగా కరవుకాటకాలకు గురియైన రాయలసీమయందెక్కువగా ఫలించాయి. వీరి ప్రయత్నాలవల్ల అనేకులు క్రైస్తవమతాన్ని స్వీకరించారు.

వైద్యవిద్యా ప్రచార విషయంలో క్రైస్తవమత సంస్థలు చేసి, చేస్తున్న సేవ కొనియాడదగింది. పట్టుదలతో మిషనరీలు చేసిన నిస్వార్థ కృషితో ఆంధ్రదేశంలో లక్షల మంది క్రైస్తవులయ్యారు. నేటికీ సంఖ్య దాదాపుగా పదింతలుగా పెరిగిందని చెప్పవచ్చు. క్రైస్తవ్యానికీ దేశంలో ప్రముఖస్థానం లభించింది.

భారతదేశంలో క్రైస్తవ మత విస్తరణకు సంబంధించిన పై వివరాల్నిబట్టి క్రైస్తవ్యం ఒక ప్రాంతానికి, ఒక జాతికి, ఒక భాషకు పరిమితమైంది కాదన్న విషయం స్పష్టంగా తెలుస్తుంది. అంతేకాక కుల, మత, వర్గ వివక్షత లేకుండా అందరూ క్రీస్తునంగీకరించి క్రైస్తవులుగా మారటాన్ని చూస్తే క్రైస్తవ్యానికి కుల, మత, వర్గ, ప్రాంతాలతో సంబంధం లేదన్న విషయం కూడా విస్పష్టం.

వీటన్నిటినీ మించి, "సర్వలోకానికి, సర్వ సృష్టికి సువార్తనందించండి" అనే యేసుక్రీస్తు వారి ఆజ్ఞనందుకుని, క్రైస్తవ మిషనరీలు చేసిన ప్రయత్నాల వల్ల ఆంధ్రదేశంలోను, భారతదేశంలోను, ప్రపంచమంతటా క్రైస్తవ్యం విస్తరించింది. ఇంకా విస్తరిస్తూనే ఉంది.

(ఈ వ్యాసం "**తెలుగు బైబిలు అనువాదాలు - ఒక పరిశీలన**" అనే గ్రంథం నుండి సంగ్రహించబడింది)